సాక్షి
విశాఖపట్నం
శనివారం । 21 । జూన్ । 2025



25వేల మందితో సూర్య నమస్కారాలు

- రికార్డు సృష్టించిన ఆదివాసీ విద్యార్థులు
- గిన్నిస్ రికార్డుతో అద్భుతం
- నేడు ప్రకటించనున్న 'గిన్నిస్' ప్రతినిధులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ మైదానం వేదికగా అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన 106 పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ప్రపంచ రికార్డును నెలకొల్పారు. కల్మషం లేని మనసులతో, చిరునవ్వులను ఆభరణంగా ధరించిన 25 వేల మందికి పైగా చిన్నారులు ఒకేసారి, లయబద్ధంగా యోగాసనాలు వేస్తూ సరికొత్త గిన్నిస్ రికార్డును సాధించారు. గతంలో 21,800 మంది విద్యార్థులతో నెలకొల్పిన రికార్డును వారే తిరగరాశారు. ఈ అద్భుత ఘట్టం ద్వారా విశాఖ నగరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రికార్డు పుటల్లోకి ఎక్కాయి.

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ సూర్య నమస్కారాల ప్రదర్శన, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో జరిగింది. 108 నిమిషాల వ్యవధిలో, 108 ఆసనాలను 25 వేల మందికి పైగా చిన్నారులు **ఏకకాలంలో ఒకే వేదికపై ప్రదర్శించి ఈ రికార్డును లిఖించారు. ఈ రికార్డు వివరాలను శనివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అధికారికంగా ప్రకటించనున్నారు.**



విద్యార్థుల క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న సిబ్బంది

మంత్రుల ప్రశంసలు

కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ మాట్లాడుతూ, ఒకే వేదికపై 25 వేల మంది గిరిజన విద్యార్థులు ఇంతటి మహోన్నతమైన ప్రపంచ రికార్డును స్థాపించడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పట్టణ ప్రాంతాల విద్యార్థుల కంటే ఎంతో దృఢంగా ఉన్నారని ప్రశంసించారు. పట్టణ యువత జంక్ ఫుడ్ తింటూ, మొబైల్స్‌లో మునిగిపోయి శారీరక వ్యాయామాన్ని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, కార్యక్రమానికి హాజరైన చిన్నారుల నిబద్ధత, పట్టుదలను అభినందించారు. ప్రపంచం మొత్తం విశాఖ నగరం వైపు చూసే విధంగా చిన్నారులు ఈ సరికొత్త రికార్డు సృష్టించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నూతన రికార్డును సృష్టించిన చిన్నారులను దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి తరపున అభినందించారు. ఇక్కడి చిన్నారులను చూస్తుంటే తన కుమారుడు దేవాన్ష్ గుర్తుకు వస్తున్నాడని, ఇదే క్రమశిక్షణ తన కుమారుడికి నేర్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రుల కోరికలను ప్రధాని మోదీ తీరుస్తున్నారని, రాష్ట్రానికి అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపారని, రైల్వే జోన్ ఇచ్చారని, అమరావతి అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ విజయానంద్, యోగా ప్రత్యేక అధికారి కృష్ణబాబు, అనకాపల్లి ఎంపీ సి.ఎం రమేష్, కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఆయుష్ శాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ రికార్డును పరిశీలించే ప్రత్యేక బృందం మొత్తం ప్రక్రియను వీడియో తీసింది. హాజరైన ప్రతి విద్యార్థికి ఒక క్యూఆర్ కోడ్‌ను అందించి, వాటిని ప్రాంగణంలో స్కానింగ్ చేసి చిన్నారుల లెక్కింపు జరిపారు.

యోగాంధ్రకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య 7,72,812	యోగా ప్రదర్శకులు 1,438	ఎల్‌ఈడీ స్క్రీన్లు 335
జనం తరలింపునకు వాహనాలు 9,995	యోగా శిక్షకులు 907	మరుగుదొడ్లు 4,280
	గిన్నిస్‌బుక్ రికార్డు నమోదు కోసం ప్రతినిధులు 4,600	పార్కింగ్ ప్రదేశాలు 75



యోగాంధ్రకు విశాఖ సిద్ధం

నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాఖ సిటీ: అపూర్వ స్థాయిలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ సిద్ధమైంది. ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల పొడవునా, 5 లక్షల మందితో యోగా ప్రదర్శన నిర్వహించి రికార్డు సృష్టించాలని జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నగరంలోని 18 క్రీడా మైదానాల్లోనూ యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కార్యక్రమం శనివారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమై ఉదయం 7:50 గంటలకు ముగుస్తుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు, తూర్పు నావికాదళ అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొంటారు.

26 కిలోమీటర్ల బీచ్ రోడ్డు పొడవునా భారీ సంఖ్యలో పాల్గొనేవారి కోసం కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు మొత్తం 326 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, పది మంది వలంటీర్లు, ఒక ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, ఒక పోలీసు అధికారి, గిన్నిస్ రికార్డు నమోదు కోసం పది మంది ప్రతినిధులు (మొత్తం 4,600 మంది ప్రతినిధులు), ఒక ఫుడ్ ఇన్‌చార్జి, ఇద్దరు సూపర్‌వైజర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, నలుగురు పారిశుధ్య కార్మికులు ఉంటారు.

గిన్నిస్ రికార్డు లక్ష్యంగా 5 లక్షల మందితో యోగాసనాలు
హాజరుకానున్న ప్రధాని మోదీ, సీఎం, ఇతర ప్రముఖులు
18 క్రీడా మైదానాల్లో ప్రదర్శనలు.. బీచ్ రోడ్డులో 326 కంపార్ట్‌మెంట్లు
ఉదయం 6.30 నుంచి 7.50 వరకు కార్యక్రమం
భారీగా భద్రతా చర్యలు

ఉత్తరాంధ్ర నుంచి 9,995 వాహనాలు



ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలను తరలించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మొత్తం 9,995 వాహనాలను వినియోగిస్తున్నారు. వీటిలో 7,295 బస్సులు, 2,500 ఆటోలు, 200 మేక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. మొత్తం 75 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయమే నిర్దేశిత ప్రాంతాలకు బస్సులను పంపించారు. అల్లూరి జిల్లా నుంచి శుక్రవారం ఉదయం నుంచే తరలింపు ప్రక్రియ చేపట్టగా, మిగిలిన జిల్లాల నుంచి అర్ధరాత్రి వాహనాల్లో బీచ్ రోడ్డుకు తరలించారు. ప్రజలను ఏ కంపార్ట్‌మెంట్ వద్ద దించారో, అక్కడే వారిని తిరిగి వాహనంలోకి ఎక్కించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు బస్సులను మ్యాపింగ్ కూడా చేశారు.

10 వేల మంది పోలీసులతో భద్రత

ప్రశాంత వాతావరణంలో యోగాంధ్ర వేడుకలు జరిగేలా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఐపీఎస్‌ల నుంచి కానిస్టేబుళ్ల వరకు విశాఖకు రప్పించారు. 10 వేల మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రధాని కాన్వాయ్ వెళ్లే ప్రాంతాలను బాంబ్, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణపైనా దృష్టి సారించారు.

11 వేల మంది నేవీ సిబ్బంది

యోగాంధ్ర కార్యక్రమంలో తూర్పు నావికాదళం భాగస్వామ్యమవుతోంది. ఆర్‌కే బీచ్ సముద్ర తీరంలో 11 నావికాదళం, కోస్ట్‌గార్డు నౌకలలో నేవీ అధికారులు యోగాసనాలు వేయనున్నారు. అలాగే, ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి మధ్యలో 10 కంపార్ట్‌మెంట్లలో 11 వేల మంది నేవీ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు యోగాభ్యాసన చేస్తారు.

5 లక్షల లక్ష్యం సాధ్యమేనా?



యోగాంధ్ర కార్యక్రమానికి 5 లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ఒక్కో సచివాలయానికి లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో వారు తమకు తెలిసిన వారితో పాటు సచివాలయానికి వచ్చిన వారందరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసేశారు. చాలా మందికి రిజిస్ట్రేషన్ జరిగిన విషయం కూడా తెలియదు. తాము రిజిస్ట్రేషన్ చేయకుండానే మొబైల్‌కు మెసేజ్‌లు వచ్చాయని ఆశ్చర్యపోయారు. కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఏదేమైనప్పటికీ, మొత్తం 7,72,812 మంది ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో 5 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నా, అది ఎంత మేరకు సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి విశాఖ నుంచి ప్రజలను అర్ధరాత్రి సమయంలో తరలించడం పెద్ద సవాలుగానే కనిపిస్తోంది. డ్వాక్రా మహిళలు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని గ్రూప్ లీడర్ల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు, లేనిపక్షంలో రూ.500 ఫైన్ కట్టాలని, పథకాలు నిలిచిపోతాయని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో వీరు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి. మిగిలిన వారు మాత్రం అర్ధరాత్రి సమయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే అవకాశాలు తక్కువని అధికారులు సైతం అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, రెండు లక్షల వరకు ప్రజలు వస్తే గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు.

ప్రధానికి ఘన స్వాగతం



మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు **ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం** సాయంత్రం విశాఖ చేరుకున్నారు. **ఆయనకు ఎయిర్ పోర్టులో ఘన** స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ **అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా** చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు **కె. రామ్మోహన నాయుడు**, శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి **పవన్ కల్యాణ్, విద్యా శాఖ** మంత్రి నారా లోకేష్, స్పీకర్ సీహెచ్. **అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జ్** మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ ఎం. శ్రీభరత్, ప్రభుత్వ విప్ పి. గణబాబు తదితరులు **ఆయనకు స్వాగతం పలికారు**. అంతకు ముందు ముఖ్యమంత్రి **చంద్రబాబు నాయుడు విజయవాడ** నుంచి విమానంలో విశాఖకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఐఎన్‌ఎస్ డేగాకు **వెళ్లి ప్రధానికి స్వాగతం పలికారు**. అనంతరం నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని బస చేశారు.

18 క్రీడా మైదానాల్లోనూ వేడుకలు

సాగరతీరంతో పాటుగా మరో 18 **క్రీడా మైదానాల్లో కూడా యోగా** ప్రదర్శనలు **నిర్వహించేందుకు ఏర్పాట్లు** పూర్తయ్యాయి. **ఏయూ మైదానం, చినగదిలి** గోల్ఫ్ క్లబ్, **పీఎం పాలెం క్రికెట్ స్టేడియం,** కొమ్మాది స్టేడియం, **పోర్ట్ స్టేడియం, రైల్వే** ఎగ్జిబిషన్ గ్రౌండ్, **స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం** తదితర 18 **క్రీడా మైదానాలు, మరో 30 అదనపు** ప్రాంతాల్లోనూ **యోగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.**



యోగాంధ్రకు ముస్తాబైన క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్

4,280 మరుగుదొడ్ల ఏర్పాటు



ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ చొప్పున మొత్తం 4,280 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా 35 మంది పాములు పట్టేవారితో పాటు పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లతో పాటు, అఖిల భారత అధికారులు కూడా అందుబాటులో ఉంటారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో తాగునీరు, స్ట్రెచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్నాక్ బాక్సులు సిద్ధంగా ఉంటాయి. పాల్గొనే ప్రతి ఒక్కరికీ యోగా మ్యాట్, టీ షర్ట్ అందజేస్తారు. యోగా ప్రదర్శన అనంతరం వీటిని తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశారు. అందరికీ కనిపించేలా 335 ఎల్‌ఈడీ స్క్రీన్లు, 326 వైఫై పాయింట్లు, సౌండ్ సిస్టమ్ అందుబాటులో ఉంచారు. అత్యవసర మందులతో కూడిన 104 వాహనాలతో పాటు, ప్రతి 5 కిలోమీటర్లకు ఒక 5 పడకల ఆసుపత్రిని సిద్ధం చేశారు.



బస్సులు లేక అప్పన్న భక్తుల అవస్థలు

నిరసన'యోగ'



8లో

గ్రేటర్ గాడిన పడేనా?

- ఐదు నెలల తర్వాత జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్
- అస్తవ్యస్తమైన పాలన.. కొరవడిన పర్యవేక్షణ
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న గ్రేటర్ విశాఖ
- నేడు కేతన్ గార్గ్ బాధ్యతల స్వీకరణ

దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పాలన గాడి తప్పింది. సుమారు ఐదు నెలలుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో అధికార యంత్రాంగం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తోంది. పేరుకుపోయిన ఫైళ్లు, పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు, నగర వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త.. ఇలా సమస్యల వలయం మధ్య జీవీఎంసీ నూతన కమిషనర్‌గా కేతన్ గార్గ్ శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ప్రయాణం ఆరంభంలోనే సవాళ్లతో నిండిన కత్తిమీద సాములా మారింది.

గత ఐదు నెలలుగా జీవీఎంసీ పరిధిలో పనితీరు ఎలా ఉందో తెలుసుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఫైళ్లు నెలల తరబడి కదలడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల్లో సగం కూడా పరిష్కారం కాలేదు. గత కమిషనర్లు(ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ తప్ప) నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు చేసేవారు. స్థానికుల నుంచి సమస్యలడిగి తెలుసుకునేవారు. సాయికాంత్ వర్మ అయితే జోనల్ కమిషనర్లకు తెలపకుండానే ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలు కరువయ్యాయి. జోనల్, అదనపు కమిషనర్లు సైతం కార్యాలయాలకే పరిమితం కావడంతో, నగరంలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా పడకేసింది. ఈ అస్తవ్యస్తమైన పాలనను తిరిగి గాడిన పెట్టడం నూతన కమిషనర్ ముందున్న అతిపెద్ద బాధ్యత.

ముంచుకొస్తున్న ముప్పు.. రాజకీయ ఒత్తిళ్లు

వర్షాకాలం సమీపిస్తున్న వేళ నగరంలోని గెడ్డలు, కాలువలు పూడిక తీయక చెత్తతో నిండిపోయాయి. ఒక మోస్తరు వర్షానికే నగరం ముంపునకు గురవుతోంది. దీంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

మరోవైపు టీడీఆర్‌ల వ్యవహారం గందరగోళంగా మారింది. ఈ చిక్కుముడిని విప్పాల్సిన అవసరం ఉంది. వీటన్నింటికీ మించి మరో 10 నెలల పదవీ కాలం మాత్రమే ఉన్న ప్రస్తుత పాలకవర్గంతో సమన్వయం సాధించడం అత్యంత కీలకం. పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య సమతూకం పాటిస్తూ కౌన్సిల్ సమావేశాలను సజావుగా నడపడం ఆయన నాయకత్వ పటిమకు పరీక్షగా నిలవనుంది. మొత్తం మీద కేతన్ గార్గ్‌కు జీవీఎంసీ కమిషనర్ కుర్చీ ముళ్ల కిరీటంలా మారనుంది. అస్తవ్యస్తంగా మారిన పాలనను చక్కదిద్దడం, ఆర్థిక వనరులను సమీకరించడం, ప్రజారోగ్యాన్ని కాపాడటం, పాలక, ప్రతిపక్షాల సమన్వయం సాధించడం వంటి బహుముఖ సవాళ్లను ఆయన ఎలా అధిగమిస్తారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ఆర్థిక ఇబ్బందులు.. అభివృద్ధికి అడ్డంకులు

జీవీఎంసీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అభివృద్ధి పనులకు నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం జీవీఎంసీ బడ్జెట్‌లో భారీ లోటు ఉంది. 2025–26 అంచనాల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే రూ.302.93 కోట్ల తగ్గుదల ఏర్పడింది. దీనికి తోడు, వివిధ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ. 400 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. ఇటీవల అడపాదడపాగా కొంత మేర చెల్లించినప్పటికీ ఐదు నెలలుగా పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో ఈ బిల్లులపై ఇన్‌చార్జి కమిషనర్ దృష్టి పెట్టలేదు. దీంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ఖజానా ఖాళీగా ఉన్న ఈ తరుణంలో, పేరుకుపోయిన బకాయిలను చెల్లించి, కొత్త పనులకు నిధులు సమీకరించడం కమిషనర్‌కు పెను సవాల్‌గా మారనుంది.

వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 23న జరగనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు ఆధ్వర్యంలో 'యువత పోరు' పోస్టర్‌ను ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందని, దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 'ఇంటికో ఉద్యోగం లేదా నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు' ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 'యువగళం' పేరుతో రాష్ట్ర యువత అందరినీ లోకేష్ మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, పలువురు ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనలకు ప్రజలు బ్రహ్మరథం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన చేస్తున్న పోరాటాలకు రాష్ట్రంలోని రైతులు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరు మిర్చి యార్డు నుంచి మొన్న పొదలిలో పొగాకు రైతులను పరామర్శించడం వరకు వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ గూండాలు దాడులు చేసి, ఆ నెపాన్ని వైఎస్సార్ సీపీపై మోపాలని చూస్తున్నారని ఆరోపించారు. పోలీసులతో అనేక విధాలుగా మా నాయకుడు పర్యటనను అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. అందులో భాగంగానే.. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో పోలీసుల వేధింపులకు బలైన ఉపసర్పంచ్ నాగమల్లేశ్వర కుటుంబాన్ని పరామర్శించడానికి వెళితే అనుమతి ఇవ్వకుండా కర్ఫ్యూ విధించారన్నారు. పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వైఎస్ జగన్‌కు అండగా నిలిచారన్నారు. చివరికి టీడీపీకి చెందిన కార్యకర్తే ఆ పార్టీపై విసుగు చెంది పుష్ప-2 సినిమా డైలాగును పోస్టర్‌గా చేసి చూపిస్తే.. కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కూటమి నాయకులు, పచ్చ మీడియా ఏదో తప్పు జరిగినట్లు విషప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు బుచ్చయ్య చౌదరి చంద్రబాబు డైరెక్షన్‌లో ఒక అడుగు ముందుకేసి 'జగన్‌మోహన్‌రెడ్డి తల నరికితే తప్పేంటి?' అని మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లక్షలాది మంది జనాభిమానం ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మీరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. అతన్ని ఏమీ చేయలేరని కె.కె.రాజు అన్నారు.

నర్సుల బదిలీల బాగోతం

పైరవీలకే పెద్దపీట?
- నిబంధనలకు నీళ్లు.. మానవత్వానికి తిలోదకాలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో ముగిసిన నర్సుల బదిలీల ప్రక్రియ తీవ్ర గందరగోళానికి, అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు, భారీగా చేతులు మారిన ముడుపులకే ప్రాధాన్యతనిచ్చి, నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్యంతో బాధపడేవారికి, ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి కనీస మానవత్వం చూపకుండా, అన్యాయంగా పోస్టింగులు ఇవ్వడంపై నర్సుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

క్యాన్సర్ బాధితులకూ తప్పని కష్టాలు

బదిలీల ప్రక్రియలో అధికారులు కనీస మానవతా దృక్పథాన్ని కూడా చూపలేదని పలు ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

- క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆరుగురు నర్సులను విశాఖకు సమీపంలో కాకుండా, సుదూర ప్రాంతాలైన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేశారు.
- రెండు కాళ్లు సరిగా పనిచేయని ఒక దివ్యాంగ నర్సుకు నగరంలో పోస్టులు ఖాళీ లేవని చెప్పి, విజయనగరానికి పంపించారు.
- మానసిక వికలాంగులైన పిల్లలున్న ఒక తల్లిని కేజీహెచ్ నుంచి ఆంధ్రా మెడికల్ కాలేజీకి బదిలీ చేయగా, అలాంటి పరిస్థితే ఉన్న మరో నర్సును సింహాచలానికి పంపడం వివాదాస్పదమైంది.
- 50 ఏళ్లు పైబడిన నర్సులను నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపించారు.
- ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న ఒక నర్సుకు ఏకంగా ఏఎస్ఆర్ జిల్లాలోని హుకుంపేటలో పోస్టింగ్ ఇచ్చారు.

జీవోలు బుట్టదాఖలు

నర్సుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, నిబంధనలను బుట్టదాఖలు చేశారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి, తమకు కావాల్సిన వారికి బదిలీలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మార్గదర్శకాలను, నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదని తెలుస్తోంది. మైదాన ప్రాంతాల్లో ఖాళీలు లేవని సాకులు చెప్పి, 50 నుంచి 55 సంవత్సరాలు పైబడిన నర్సులను అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారు. చాలా కాలంగా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న నర్సులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయకుండా.. నగరంలో ఖాళీలు లేవని అధికారులు బహిరంగంగా చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలి. ఏజెన్సీలో ఎప్పుడూ పనిచేయని వారిని కూడా అక్కడ బదిలీ చేయడానికి కొంతమంది అధికారులు ఇష్టపడకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. బదిలీల విషయంలో కొంతమంది అధికారులు ప్రజాప్రతినిధుల పేర్లను వాడుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

విచారణ జరగాల్సిందే..

ఈ వ్యవహారంపై ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణిని వివరణ కోరగా.. 'బదిలీలన్నీ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే జరిగాయి. ఎలాంటి అవకతవకలు జరగలేదు. పోస్టులు ఖాళీగా ఉన్నచోట మాత్రమే ఇవ్వగలిగాం. ఖాళీలు లేకపోతే మేమేమీ చేయలేం' అని తెలిపారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో మొత్తం 1090 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, 740 మందికి బదిలీలు పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అయితే అధికారుల వివరణకు, క్షేత్రస్థాయిలో జరిగిన అన్యాయాలకు పొంతన లేకపోవడంతో బదిలీల ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణ జరపాలని నర్సులు డిమాండ్ చేస్తున్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎస్. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో నడుస్తున్న 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో (4 బాలుర, 7 బాలికలు) ప్రవేశాలు కల్పించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న మిగులు సీట్లను భర్తీ చేయనున్నారు.

ఖాళీల వివరాలు

బాలుర గురుకులాలు(దేవరాపల్లి, గొలుకొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం)

6వ తరగతి: ఎస్సీ-60, బీసీ-6, ఓసీ-1, 7వ తరగతి: ఎస్సీ-34, బీసీ-1, ఓసీ-1, 8వ తరగతి: ఎస్సీ-24, బీసీ-1, ఓసీ-1, 9వ తరగతి: ఎస్సీ-26, ఓసీ-2

బాలికల గురుకులాలు (నక్కపల్లి, మేహాద్రిగెడ్డ, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, మధురవాడ)

6వ తరగతి: ఎస్సీ-32, బీసీ-4, ఓసీ-4, 7వ తరగతి: ఎస్సీ-32, ఓసీ-1, 8వ తరగతి: ఎస్సీ-5, ఓసీ-2, 9వ తరగతి: ఎస్సీ-9, బీసీ-2

25న ప్రవేశ పరీక్ష

ఆసక్తి కలిగిన బాలురు, బాలికలు ఏ పాఠశాలలో ప్రవేశం పొందాలనుకుంటున్నారో ఆయా పాఠశాలల నుంచి దరఖాస్తులను పొందవచ్చు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా సంబంధిత పత్రాలు దరఖాస్తుకు జతచేసి సమర్పించాలి. తాళ్లపాలెం గురుకులంలో బాలికలకు, శ్రీకృష్ణాపురంలోని గురుకులంలో బాలురకు ఈ నెల 25వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.

బస్సులు లేక అప్పన్న భక్తుల అవస్థలు



రాత్రి 8 గంటల సమయంలో బస్సులు లేక నిర్మానుష్యంగా ఉన్న సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్



రాత్రి సమయంలో బస్సుల కోసం వేచి చూస్తున్న భక్తులు

సింహాచలం: యోగాంధ్ర.. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి భక్తులకు తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్లేందుకు నానా తంటాలు పడ్డారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకోవడానికి సింహాచలం వచ్చారు. వారిలో పలువురు తిరుపతి, విజయవాడ, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించి, తిరుగు ప్రయాణంలో సింహాచలం చేరుకున్నారు. దర్శనం పూర్తవ్వగానే సింహాచలం నుంచి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే వారికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

నెల్లిమర్ల నుంచి వచ్చాం

నెల్లిమర్ల నుంచి 20 మందితో తిరుపతి యాత్రకు వెళ్లిన ఓ భక్తుడు తన ఆవేదనను వెలిబుచ్చారు. 'మేము మధ్యాహ్నం సింహాచలం చేరుకుని స్వామిని దర్శించుకున్నాం. రాత్రి 8 గంటల సమయంలో విజయనగరం వెళ్లేందుకు సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వచ్చాం. తీరా చూస్తే బస్సులు లేవు. ఎలా వెళ్లాలో తెలియక చాలా గందరగోళంగా ఉంది.' అని ఆయన వాపోయారు.

స్తంభించిన ప్రజా రవాణా

తగరపువలస: యోగాంధ్ర కారణంగా శుక్రవారం తగరపువలస పరిసర ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఉదయం నుంచి ఆర్టీసీ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. కూర్మన్నపాలెం, గాజువాక, విశాఖ రైల్వే స్టేషన్ నుంచి తగరపువలస మీదుగా విజయనగరం వరకు నడిచే సిటీ బస్సులు, అలాగే విశాఖపట్నం నుంచి విజయనగరం, శ్రీకాకుళం మధ్య తిరిగే పల్లెవెలుగు బస్సులు రోజంతా కనిపించకుండా పోయాయి. దీంతో గంటల తరబడి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ రోడ్లపైనే నిరీక్షించాల్సి వచ్చింది. విజయనగరం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించకపోవడంతో విశాఖ నుంచి అటువైపు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బస్సులను నిలిపివేయడం వల్ల వైద్య అత్యవసరాల నిమిత్తం వెళ్లేవారు, అలాగే విశాఖ, విజయనగరంలో రైళ్లు అందుకోవాల్సిన వారు నరకయాతన అనుభవించారు. సాధారణంగా బస్సులతో కిక్కిరిసి ఉండే బస్టాండ్‌లు ఖాళీగా కనిపించడంతో వింత వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన చిరు వ్యాపారులు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి అదనపు ఖర్చులు భరించాల్సి వచ్చింది. శనివారం కూడా ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.



వేంకటేశ్వరమెట్ట వద్ద బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

తూర్పు తీర లాజిస్టిక్స్ రాజధానిగా ఎదగడమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి తూర్పు తీర లాజిస్టిక్స్ రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నోవాటెల్‌లో శుక్రవారం జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పోర్ట్ ఆపరేటర్లు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లు, షిప్పింగ్ లైన్లు, మౌలిక సదుపాయాల డెవలపర్లు, ప్రపంచ భాగస్వాములను ఆహ్వానించారు. రాష్ట్రంలో భూమి లభ్యత, సులభతర అనుమతులు ఉన్నాయని, బలమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా స్థిరమైన మౌలిక సదుపాయాలను సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, ఎయిర్ కార్గో టెర్మినల్స్, లాజిస్టిక్స్ పార్కుల ద్వారా వాణిజ్యాన్ని పెంచడం, ఉద్యోగాలను సృష్టించడం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత ఏడాది కాలంలో పోర్టులు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. పారిశ్రామిక వృద్ధి, వాణిజ్య పోటీతత్వం, ప్రాంతీయ శ్రేయస్సుకు బలమైన లాజిస్టిక్స్ అత్యవసరం అన్నారు. ఇందుకనుగుణంగా రామయ్యపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల తొలి దశ పనులు 2026 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని చెప్పారు. అన్ని రవాణా విధానాలలో సమగ్ర అభివృద్ధిని సాధించడానికి, పోర్టులు, విమానాశ్రయాలు, ఫిషింగ్ హార్బర్‌లు, రోడ్ కారిడార్‌లను సమన్వయం చేయడానికి రాష్ట్ర లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

'శ్రీవరాహ లక్ష్మీ నృహరి శతకం' పుస్తకావిష్కరణ

సింహాచలం : సింహగిరిపై శుక్రవారం శ్రీవరాహ లక్ష్మీ నృహరి శతకం పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. భాషా ప్రవీణ శ్రీమాన్ అద్దంకి వెంకట రాఘవాచార్యులు రచించిన ఈ పుస్తకాన్ని దేవస్థానం ఈవో వి. త్రినాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ భారతదేశంలో వరాహ క్షేత్రాలు, నృసింహ క్షేత్రాలు ఎన్నో ఉన్నప్పటికీ, వరాహ, నృసింహ రూపాల కలయికతో విరాజిల్లుతున్న ఏకైక క్షేత్రం సింహాచలమే అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు సింహాచలం క్షేత్రం చిహ్నంగా నిలుస్తోందని తెలిపారు. సింహాచలం క్షేత్రంలో 32 నృసింహ రూపాలు దర్శనమిస్తాయని, సామాన్యులకు ఆ రూపాల లక్షణాలను తెలియజేసేందుకు ఆలయ బేడా మండపంలోని స్తంభాలపై వాటిని చెక్కారని వివరించారు. ఈ పుస్తకం కూడా ఆ గొప్పదనాన్ని తెలియజేసే విధంగా ఉంటుందన్నారు. ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

రక్షణ రంగ పరిశోధనల్లో ఏయూ భాగస్వామ్యం

ఉపకులపతి రాజశేఖర్

మద్దిలపాలెం: రక్షణ రంగ పరిశోధనల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యుల భాగస్వామ్యం ఉండాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ అమెరికన్ కార్నర్‌లో వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం, ఎస్ఐడీఎం సంయుక్తంగా శుక్రవారం 'ఆప్టిమైజింగ్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ క్యాపబిలిటీస్ విత్ కొలాబరేషన్ ఆఫ్ ఎక్స్‌పర్ట్' సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ పీహెచ్‌డీ పరిశోధకులకు రక్షణ సంబంధిత సమస్యలను అధ్యయన అంశాలుగా ఇవ్వాలని సూచించారు. పరిశోధన ప్రాజెక్టుల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను భాగస్వాములను చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. త్వరలో ఆసక్తిగల ఆచార్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డీఆర్‌డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏయూలో నెలకొల్పడానికి కృషి చేస్తామన్నారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) ఏపీ శాఖ చైర్మన్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ రక్షణ ప్రాజెక్టులను భారతీయ సంస్థలకే ఇవ్వాలనే ప్రతిపాదన బలంగా ఉందన్నారు. విశాఖలో మేధావులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని, ఇందులో ఏయూ కీలక పాత్ర పోషించాలని కోరారు. దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ఏయూ ఆచార్యులు, నిపుణుల సహకారం ఆవశ్యకమని నొక్కిచెప్పారు. క్వాంటం కంప్యూటింగ్, పునరుత్పాదక ఇంధన వనరులు, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఏయూతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని, సాంకేతిక, న్యాయ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో నిపుణుల అవసరం ఉందని శ్రీనివాస రాజు పేర్కొన్నారు. అనంతరం ఏయూ తరపున అతన్ని సత్కరించారు. కార్యక్రమంలో రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి, అసోసియేట్ డీన్ ఆచార్య పి.వి.వి. సత్యనారాయణ ప్రాజెక్ట్స్-ఐపీఆర్ విభాగం ప్రొఫెసర్ ఇన్‌ఆచార్య బి.కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం విశాఖ ఉమ్మడి జిల్లాలో ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుంది.

ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్

తేదీ	ర్యాంకులు
జూన్ 21	1 - 15,000
22	15,001 - 32,000
23	32,001 - 50,000
24	50,001 - 68,000
25	68,001 - 86,000
26	86,001 - 1,04,000
27	1,04,001 - 1,20,000
28	1,20,001 - చివరి ర్యాంకు

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు

కింది ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం తీసుకురావాలి. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత వాటిని తిరిగి తీసుకోవచ్చు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, 10వ తరగతి మార్కుల మెమో, 4-10వ తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ (లేదా) 7 సంవత్సరాల నివాస ధ్రువపత్రం, టీసీ, ఆదాయ ధ్రువపత్రం (2022 జనవరి 1 లేదా ఆ తర్వాత జారీ చేసినది), కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 2025-26, పీడబ్ల్యూడీ (వికలాంగుల) సర్టిఫికెట్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జారీ చేసిన క్యాప్ సర్టిఫికెట్, ఆంగ్లో-ఇండియన్ సర్టిఫికెట్, ఎన్‌సీసీ సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్.

ఇతర కేటగిరీల విద్యార్థులకు కౌన్సెలింగ్ షెడ్యూల్
(విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద)

జూన్ 25 : ఎన్‌సీసీ 1-40,000 ర్యాంకులు, పీడబ్ల్యూడీ 1 - చివరి ర్యాంకు
26 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 1 - 60,000 ర్యాంకులు, ఎన్‌సీసీ 40,001 - 80,000 ర్యాంకులు
27 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 60,001 - చివరి ర్యాంకు, ఎన్‌సీసీ 80,001 - చివరి ర్యాంకు
28 క్యాప్, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంగ్లో ఇండియన్స్ (1-చివరి ర్యాంకు వరకు)

గైస్, పాలిటెక్నిక్ కళాశాలల్లో ర్యాంకుల వారీగా నిర్దేశించిన కౌన్సెలింగ్ వివరాలు

తేదీ	కెమికల్ ఇంజినీరింగ్ (గైస్)	పాలిటెక్నిక్
జూన్ 21	1 - 7,500	7,501 - 15,000
22	15,001 - 23,500	23,501 - 32,000
23	32,001 - 41,000	41,001 - 50,000
24	50,001 - 59,000	59,001 - 68,000
25	68,001 - 77,000	77,001 - 86,000
26	86,001 - 95,000	95,001 - 1,04,000
27	1,04,001 - 1,12,000	1,12,001 - 1,20,000
28	1,20,001 - 1,27,000	1,27,001 - చివరి ర్యాంకు

వెబ్ ఆప్షన్స్ షెడ్యూల్

జూన్ 25, 26	1 - 50,000 ర్యాంకులు
27, 28	50,001 - 90,000 ర్యాంకులు
29, 30	90,001 - చివరి ర్యాంకు వరకు
జూలై 1	ఆప్షన్ల మార్పిడి
జూలై 3	సీట్ల కేటాయింపు

నిరసన యోగా

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ...

బీచ్‌రోడ్డు: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'నిరసన యోగా' నిర్వహించాయి. ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 'సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్', 'ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి', 'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి' వంటి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.గంగారావు మాట్లాడుతూ శనివారం విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రజలు స్టీల్ పరిరక్షణ కోసం పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్లాంట్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం సరికాదన్నారు. గంట జరిగే యోగా కార్యక్రమానికి వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం సమంజసం కాదన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు బి.నాగభూషణం మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, సీఎఫ్‌టీయూఐ రాష్ట్ర అధ్యక్షుడు కనకారావు, ఏపీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, పెన్షనర్స్ సంఘం, మత్స్యకార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర'కు ఏర్పాట్లు పూర్తి

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

మహారాణిపేట: బీచ్‌రోడ్డులో శనివారం నిర్వహించే యోగాంధ్రకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్ కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రలతో కలిసి విశాఖ ఆర్కే బీచ్‌లో పర్యటించారు. యోగా ప్రధాన వేదిక నుంచి జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వరకు యోగా దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లను, యోగా క్రియల కంపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు 26 కిలోమీటర్ల పొడవునా, పరిసర ప్రాంతాల్లో యోగాసనాలు వేసేందుకు వీలుగా 326 కంపార్ట్‌మెంట్లలో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ప్రజల కోసం అవసరమైన తాగునీటిని సిద్ధంగా ఉంచాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కంటైనర్ మరుగుదొడ్లలో నిరంతరం నీటి సదుపాయం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.